

ఊబఖాయం
ప్రతీ ఆరుగురిలో ఇద్దరికి ఊబకాయం 6
మారిన జీవనశైలి.. ఆహారపు అలవాట్లతో తంటాలు
పొట్ట తగ్గించేందుకు తిప్పలు





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా కొల్లేరు పెద్దింటమ్మ ఉత్సవాలు ప్రారంభం

కైకలూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోట పెద్దింటమ్మ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు అమ్మ వారికి విశేషపూజలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని భుజబలపట్నానికి చెందిన ముదునూరి రామలింగరాజు, రామసీత దంపతులు అందజేశారు. ఈవో శ్రీనివాస్, కూటమి నేతలు, సర్పంచ్‌లు, రూరల్ సీఐ రవికుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన శిలువగట్టు తిరునాళ్లు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి సారథి

నూజివీడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నూజివీడు శిలువగట్టు 14వ వార్షిక తిరునాళ్లు శనివారంతో ముగిశాయి. సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారఽథి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొనగా విజయవాడ పీఠాధిపతి పి.జోసఫ్ రాజారావు, దైవాశీర్వాదాలను అందించారు.

సాగర్ ఘోష

కృష్ణా నుంచి అందని సాగునీరు



ఎన్ఎస్పీ కాలువ యూటీలపై ఉన్న అనధికారిక రంధ్రాలు

నాగార్జునసాగర్ 2, 3 జోన్‌ల పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలు ఉన్నాయి. ఇక్కడి ఆరు నియోజకవర్గాల్లో 2.11 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఆరుతడి పంటలకు సంబంధించి నవంబరు 15 నుంచి మార్చి 15 వరకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) నిబంధనల ప్రకారం సాగర్ ఎడమ కాలువకు కేటాయించిన 32 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. కాని 11 టీఎంసీలు మాత్రమే విడుదల చేయడంతో నూజివీడు, దెందులూరు, గన్నవరం నియోజకవర్గాలకు చుక్కనీరు రాలేదు. అండర్ టన్నెల్(యూటీ)లకు పెట్టిన అక్రమ రంధ్రాలతో సరఫరా చేసిన కొద్దిపాటి నీరు వృథా అయింది. ఫలితంగా 3వ జోన్‌లలో సాగు చేసిన మిర్చి, పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర రైతులు సాగు నీరందక పంటను నష్టపోతున్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో విస్తారంగా వున్న మామిడి ప్రస్తుతం పిందె దశలో ఉంది. ఈ దశలో సాగు నీరు అత్యవసరం. అయినా అది ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి.

- ఎడమ కాల్వ ద్వారా ఇవ్వాల్సింది 32 టీఎంసీలు
- కేఆర్ఎంబీ ఆదేశించినా ఇచ్చింది 11 టీఎంసీలే
- ముగిసిన గడువు.. ఇక రైతులకు తిప్పలే
- థర్డ్ జోన్ పరిధిలో మూడు జిల్లాలు.. ఆరు నియోజకవర్గాలు
- దెందులూరు, నూజివీడు ప్రాంతాలకు నీటి కష్టాలు
- నిద్రమత్తులో నీటి సంఘాలు.. అధికార యంత్రాంగం

(నూజివీడు, ఆంధ్రజ్యోతి)

ఎన్ఎస్పీ ఎడమ కాలువ పరిధిలో డిసెంబరు వరకు సరఫరా అయిన అరకొర సాగునీటిలో అత్యధిక భాగం మైలవరం, నందిగామ నియోజకవర్గాలకు తరలింది. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పశ్చిమ కృష్ణా ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో ఆ ప్రాంత ప్రయోజనాలకు పెద్ద పీట వేయడంతోనే ఆ దిశగా అక్కడ రైతులు కొంతలో కొంత సాగు నీరు పొందే అవకాశం ఏర్పడింది. ఆ కమిటీ చైర్మన్ ఆలోచనలు ఇక్కడ ప్రజా ప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు అమలు పరిచి ఉంటే ఈ ప్రాంత రైతులకు తగు న్యాయం జరిగేది. అయితే సాగు నీరు రాక వేసవి సమీపిస్తున్న క్రమంలో చెరువులు వెలవెలపోతున్నాయి. ఫలితంగా సదరు చెరువుల నుంచి సందట్లో సడేమియాలా ఈ చెరువుల నుంచి మట్టి అక్రమ తోలకాలకు కొంత మంది శ్రీకారం చుట్టారు. వీటిని చూసిన మిగిలిన గ్రామాల నాయకులు సాగునీరు రాకపోతేనే మట్టి తోలకాలు చేసుకోవచ్చనేలా వ్యవహరిస్తుండటంతో నూజివీడు, దెందులూరు, గన్నవరం నియోజకవర్గాల రైతుల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

తప్పని నీటి ఎద్దడి

రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి థర్డ్ జోన్ పరిధిలోని కాలువలకు సాగు, తాగు నీటిని విడుదల చేయకపోతే వచ్చే వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి తప్పదు. గత ప్రభుత్వ హయాంలో సాగర్ కాలువల మెయింటినెన్స్, మరమ్మతులను పట్టించుకోకపోవడంతో ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ఈ కాలువకు పలుచోట్ల గండ్లుపడ్డాయి. మరోవైపు యూటీకి పడిన అనధికారిక రంధ్రాలతో అవి ఎప్పుడు కుప్పకూలుతాయో తెలియని పరిస్థితి. వీటిని గమనించి ఎన్ఎస్పీ కాలువలకు తక్షణ మరమ్మ తులు చేపట్టడంతోపాటు వేసవి తాగు నీటి ఎద్దడిని గమనించి సాగు, తాగు నీటిని విడుదల చేసి చెరు వులను నింపకపోతే పశుపక్ష్యాదులకు నీరందని పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంటుంది.

విభజన సమస్యల పరిష్కారం దిశగా

సాగు నీటి సరఫరాలో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లకు నిబంధనల ప్రకారం కేటాయించిన నీటి కేటాయింపులను సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఇరు ప్రభుత్వాలతోపాటు కేంద్రంపైన ఉంది. రాష్ట్రం, కేంద్రంలో ఎన్‌డీఏ నేతృత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలు జరిపి, ముస్ముందు సాగునీరు సరఫరాలో అడ్డంకులు కలగకుండా సకాలంలో పంపిణీ జరిగేలా విభజన సమస్యల పరిష్కారం దిశగా.. అడుగులు వేయాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది.

మరమ్మతులు చేయకపోవడంతో..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్పీ) ఎడమ కాల్వ నిర్వహణ చూడాల్సిన అధికారులు ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో ఈ సమస్య వచ్చింది. ఎప్పటికప్పుడు యూటీలను పర్యవేక్షించి, కాలువకు పడిన గండ్లకు మరమ్మతులు చేస్తూ సాగునీటి సరఫరా చేసే సమయానికి సిద్ధం చేయాలి. ఈ బాధ్యత అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులదే.

కాని, నూజివీడు, తిరువూరు, మైలవరం, గన్నవరం, దెందులూరు నియో జకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు, నీటిసంఘాల ప్రతినిధులు ఈ కాల్వల మరమ్మతులపైన, దామాషా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని మూడో జోన్‌కు రావాల్సిన సాగునీటి సరఫరాపైనా దృష్టి సారించకపోవడంతో రైతాంగానికి తీవ్ర నష్టం జరిగింది.



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి

28 టేబుల్స్.. 17 రౌండ్లు

కలెక్టర్ వెట్రిసెల్వి స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ఏలూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి):'ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల మూడో తేదీ జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశాం. మొత్తం 28 టేబుల్స్‌ను ఏర్పాటు చేసి, 17 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తాం' అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శనివారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఓట్ల లెక్కింపును పూర్తిగా అవగాహన చేసుకుని పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఆ రోజు సిబ్బంది అంతా ఉదయం ఆరు గంటలలోగా ఈ కేంద్రానికి చేరుకోవాలని ఆదేశించారు. 27న జరిగిన ఎన్నికల్లో రెండు లక్షల 18 వేల 902 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. బ్యాలెట్ బాక్సుల స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత, నిఘా వ్యవస్థను ఆమె పరిశీలించారు. ఇక్కడ పటిష్ట భద్రతతోపాటు సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ టెన్షన్

రేపే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు



- పోలైన ఓట్లలో 51 శాతం ప్రాధాన్యత ఓట్లు లభిస్తేనే విజేత
- గంటల తరబడి లెక్కింపు..
- ఇందుకు పట్టే సమయం.. ఒకటి, రెండు రోజులు.. గత అనుభవాలు చెప్పేది ఇదే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ ముగిసింది. ఇక మిగిలిందల్లా ఓట్ల లెక్కింపు. ప్రచార సమయంలో అభ్యర్థులు తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయమని ప్రాధేయపడ్డారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలోనే ఓటు వేస్తూ వచ్చారు. ఇప్పుడు అసలు ప్రాధాన్యత ఓటు అంటే ఏమిటి, మొదటి ప్రాధాన్యత ఓటు, ఇతర ప్రాధాన్యత ఓట్లకు తేడా ఏమిటి, ఈ ఓట్లు ఏ విధంగా లెక్కిస్తారు. అసలు విజేతగా గెలవాలంటే అభ్యర్థికి రావాల్సిన ఓట్లు ఎన్ని. లెక్కింపు ప్రక్రియ ఎలా ఉంటుంది.. అనే ప్రశ్నలే అటు ఓటు వేసిన వారికి, ఇటు ఫలితం కోసం ఎదురుచూసే వారికి మధ్య ఎన్నో సందేహాలు వ్యక్తమవుతాయి.

లెక్కింపు ప్రక్రియ ఇలా..

ఓటు వేసిన వారి పోలైన ఓట్లలో చెల్లుబాటు అయిన ఓట్లనే పరిగణనలోకి తీసుకుంటారు. అలా ఆ ఓట్లలో సగానికంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు పోలైన ఓట్లు 2 లక్షల 14 వేలు. ఈ మొత్తం ఓట్లు చెల్లుబాటు అయితే విజేతకు లక్షా ఏడు వేల ఒక ఓటు రావాలి. అలా వస్తేనే మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ అభ్యర్థి గెలుపొందినట్టు. ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ మైలురాయి అధిగమించకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. గెలుపు కోటాకు సరిపోయినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకు మిగతా ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత ఓటు తర్వాత రెండో ప్రాధాన్యత ఓటును లెక్కిస్తారు. పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యత ఓటు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆరోహణ క్రమంలో అభ్యర్థులు సాధించిన మొదటి ప్రాధాన్యత ఓట్ల జాబితాను తయారు చేస్తారు. ఇలా చివరి అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు ఎవరు వేశారని ఓట్లను లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తూ వస్తారు. ఇలా కింద నుంచి పైవరకు ఇదే తరహాలో లెక్కించి ఈ ఓట్లను కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళ్తారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోను మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థి చేరకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను గణించి ఆ అభ్యర్థికి జమ చేస్తూ వస్తారు. అప్పటికీ కాకపోతే నాలుగో ప్రాధాన్యం ఇలా మెజార్టీ మార్కు సంఖ్యను ఏదో ఒక అభ్యర్థికి చేరే వరకు ఎలిమినేట్ ప్రక్రియ సాగుతూనే ఉంటుంది. అందుకే అభ్యర్థుల గెలుపోటముల్లో మొదటి ప్రాధాన్యంతోపాటు ఇతర ప్రాధాన్యత ఓట్లు చాలా కీలకం అవుతాయి.

> గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటే 14 గంటల తర్వాత గాని లెక్కింపు ప్రక్రియ ఒక కొలిక్కిరాదు. దీనిని బట్టి చూస్తే ఓట్ల లెక్కింపు ప్రక్రియ 36 లేదా 48 గంటలపాటు సాగే అవకాశం లేకపోలేదు.

ఈ రెండింటికి ఇదే తేడా

- ఐదేళ్లకొకసారి జరిగే సాధారణ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను వాడుతున్నారు. పోలింగ్‌లోను, కౌంటింగ్ వేగవంతంగా జరుగుతుండడం వీటి ప్రత్యేకత. రెండు, మూడు గంటల్లోనే ఫలితాలు వెల్లడవడంతో విజేతలు ఎవరో వెంటనే తెలిసిపోతోంది.
- ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చే సరికి పూర్తిగా బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. ప్రాధాన్యత క్రమంలో లభించే ఓట్లను బట్టే ఫలితం ఆధారపడి ఉంటుంది. విజేత ఎవరో తెలుసుకునేందుకు గంటలకు బదులు రోజుల తరబడి ఓట్ల లెక్కింపు జరుగుతూనే ఉంటుంది. ఈ రెండింటికి వ్యత్యాసం ఇదే.

ఇప్పటికే ఎడతెగని ఉత్కంఠ

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలోను ఓటర్లు ఏ రకంగా స్పందించారనే ఉత్కంఠ అందరి అభ్యర్థుల్లోను నెలకొంది. తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్యే ఇప్పుడు ఫలితం తేలబోతుందని భావిస్తున్నారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియ సాధారణ ఎన్నికలకంటే భిన్నంగా ఉండబోతుండడంతో అందరిలోను టెన్షన్ నెలకొంది. మామూలుగా సాదాసీదాగానే ఎలక్ట్రానిక్ యంత్రాలతో కౌంటింగ్ పూర్తి చేస్తే గంటల వ్యవధిలోనే ఫలితం బయటపడేది. కాని ప్రాధాన్యత ఓటును పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కించాలి. కాబట్టి ఈ ప్రక్రియ ఆసాంతం సుదీర్ఘంగానే సాగుతుంది. ఈసారి జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే మొదటి ప్రాధాన్యతలోనే అభ్యర్థి గెలుపోటములు తేలబోతున్నాయని భావిస్తున్నారు. ఇప్పటికే ఓట్లను ఎలా లెక్కించాలి, ఏ ప్రక్రియను అనుసరించాలనే దానిపై ఎన్నికల సంఘం కౌంటింగ్ సిబ్బందికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చింది. ఎటు తిరిగి ఫలితం వెలువడే సరికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది.



దెందులూరు సమీపంలో గోదావరి కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు/దెందులూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో సాగు, తాగునీటి సమస్య తలెత్తకుండా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. నిర్దేశించిన సమయంలోగా ఇరిగేషన్ కాల్వలు, చెరువుల్లో గుర్రపుడెక్క, తూడు పూడిక తీత పనులను పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో ఉంచండి' అంటూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు, దెందులూరు, భీమడోలు మండలాల్లోని సత్యనారాయణపురం, సింగవరం, గుండుగొలను ప్రాంతాల్లోని ఇరిగేషన్ కాల్వలు, చెరువులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఇరిగేషన్ పనులు నిధుల కొరత ఎక్కడా లేదు. గుర్రపుడెక్క, తూడు, ఇతర పూడికతీతలు చేయని కారణంగా నీటి సమస్య తలెత్తిందని ఫిర్యాదు అందితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామ'ని హెచ్చరించారు. గోదావరి నుంచి 836 క్యూసెక్కులు సాగునీరు వస్తున్న ఎందుకు వరి రైతులకు సాగునీరు అందడం లేదని అధికారులను ప్రశ్నించారు. జల వనరులశాఖ ఎస్ఈ పి.నాగార్జునరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్లు సుమతి, రమాదేవి, ఇంజనీర్లు పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురళీ కృష్ణంరాజు, నీటి సంఘాల చైర్మన్‌లు వెలమాటి రామ చంద్రప్రసాద్, చలసాని వెంకట రాంబాబు, నెరుసు వెంకట రమణ, పర్వతనేని రంగారావు పాల్గొన్నారు.

3091 కేసులు | రూ.కోటీ ఐదు లక్షల అపరాధ రుసుము 7

అధికారాల విభజన కోసమేనా?

- దేవాలయాల పునర్విభజనతో ఎవరికి మేలన్న చర్చ
- ఆలయాల కేటగిరీల మార్పుపై కసరత్తు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో దేవాలయాల పునర్విభజన ప్రక్రియ దశల వారీగా జరుగుతోంది. ఇటీవల జిల్లాలో దాదాపు 100 వరకు ఆలయాలు, మరికొన్ని సత్రాలను ఆదాయాల ఆధారంగా కేటగిరులు పునర్విభజన చేశారు. మరికొన్ని చేయడానికి దేవదాయ శాఖ కమిషనర్ దగ్గరికి ఫైళ్లు, రికార్డులను అధికారులు సమర్పించారు. జిల్లాల పునర్విభజనతో గుడివాడ, కైకలూరు డివిజన్లలోని దేవాలయాలు జిల్లాకు వచ్చాయి. ఏలూరు జిల్లా నుంచి కొన్ని పశ్చిమగోదావరి జిల్లాలో చేరాయి. వీటన్నింటిని గాడిలో పెట్టడానికే ఈ కసరత్తు జరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే ఆదాయం ఆధారంగా ఆలయాల పర్యవేక్షణ బాధ్యతలను అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల, రీజనల్ జాయింట్ కమిషనర్ల పరిధిలో చేర్చి, వారి అధికారాల విభజనకే జరుగుతోందన్న వాదన వినిపిస్తోంది. ఆలయాల ఆదాయాల ఆధారంగా 6 ఏ, బీ, సీ కేటగిరీల కింద విభజన ఉంది. జిల్లాలో 716 దేవాలయాలు, సత్రాలున్నాయి. 6ఏ కింద ఉన్నవి లెక్కలు తీస్తున్నారు. 6బీ కింద 111, 6 సీ కింద 91 దేవాలయాలు ఉన్నట్టు చెబుతున్నారు. వీటి కేటగిరీల్లో మార్పులు త్వరలో సంతరించుకోనున్నాయి. గతంలో రూ.రెండు లక్షల ఆదాయం (6సీ) ఉండేవి అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షించేవారు. రూ.15 లక్షలలోపు ఆదాయం (6బీ) ఉన్న వాటిని డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షించేవారు. రూ.50 లక్షల పైబడి ఆదాయం(6 ఏ) ఆలయాలను రీజనల్ జాయింట్ కమిషనర్ పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఈ కేటగిరీల్లో మార్పులు చేశారు. 6ఏ పరిధి పర్యవేక్షణ బాధ్యతలను అలానే ఉంచారు. రూ.17 నుంచి రూ.50 లక్షలలోపు ఆదాయం వచ్చే దేవాలయాలన్నీ డిప్యూటీ కమిషనర్, రూ.15 లక్షలలోపు ఆదాయం వచ్చే ఆలయాలను అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షిస్తారు.

> దేవాలయాల ఆదాయాలు, జమా ఖర్చుల ఇతర వివరాలను అధికారులకు నివేదిస్తున్నామని, ఆ ప్రకారం కేటగిరీల మార్పులు, ఇతరత్రా ఏర్పాట్లు పరిపాలనా సౌలభ్యం కోసం జరుగుతున్నట్టు ఏలూరు జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు తెలిపారు.

'పది' పరీక్షల్లో రిమార్క్‌లు రావొద్దు : కృష్ణారెడ్డి

ఏలూరు అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి రిమార్క్‌లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల జిల్లా పరిశీలకుడు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి ఆదేశించారు. సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన చీఫ్ సూపరిం టెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అదనపు డీవోల సమావేశంలో జిల్లాలో టెన్త్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు.



ఏలూరు సెయింట్ థెరిసా కళాశాలలో హాల్‌టిక్కెట్ల పరిశీలన

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 94 శాతం హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన ప్రథమ సంవత్సరం తెలుగు/సంస్కృతం/హిందీ/ఉర్దూ-1 పరీక్షలకు జిల్లాలో మొత్తం 18,828 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 17,704 మంది (94 శాతం) హాజరయ్యారు. జనరల్ విభాగంలో 16,315 మందికి 15,589 మంది, ఒకేషనల్ విభాగంలో 2,513 మందికి 2,115 మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని ఆర్ఐవో యోహాన్, ప్రత్యేక పరిశీలకుడు ప్రభాకరరావు తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ తీరును ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా, పరీక్షల కంట్రోలర్ సుబ్బారావు టెలీకాన్ఫరెన్సులో సమీక్షించారు. సమస్యాత్మక కేంద్రాల్లో పరీక్షల తీరును ఆర్ఐవో సీసీ కెమెరాల స్ట్రీమింగ్ ద్వారా పరిశీలించారు. ఏలూరులోని సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాల, సీఆర్ఆర్ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో, ప్రత్యేక అధికారి ఆకస్మిక తనిఖీలు చేశారు.



అతిగా తింటే.. ఊబకాయం

ప్రతి ఆరుగురిలో ఇద్దరికి ఊబకాయం సమస్య - మారిన జీవనశైలితో పెరిగిన బానపొట్టలు

ఆహారపు అలవాట్ల వల్లే తంటాలు - బెల్లి ఫ్యాట్‌తో మరింత పెద్ద పొట్టలు - తగ్గించుకునేందుకు తప్పని తిప్పలు



ఇటీవల దేశంలో పెరుగుతున్న ఊబకాయల సంఖ్యపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న ఆహారపు అలవాట్లు శారీరక వ్యాయామం లేకపోవడం, అధికంగా వంట నూనెల వినియోగం వెరసి అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణకు కనీసం 10 శాతం నూనెలు తగ్గించాలని మోదీ దేశ ప్రజలకు దిశానిర్దేశం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల్లోనూ పొట్టవీరులు అధికమవుతున్నారు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే గోదావరి పరివాహక ప్రాంతాల్లోని అధిక శాతం మంది పొట్ట ఉన్న పురుష పుంగవులే దర్శనమిస్తున్నారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకోవాలంటూ మరో వైద్యులు కూడా హెచ్చరికలు చేస్తున్నారు.. - పాలకొల్లు, ఆంధ్రజ్యోతి

పరిమితికి మించి తినేయడమే...

మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లతో ఊబకాయంతో పొట్ట పెరిగి ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య 1.80 లక్షల మంది ఉన్నట్టు అంచనా.. అలాగే ఊబకాయ బాధితులు 45వేలు మంది వరకు ఉండవచ్చని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఊబకాయులు, పొట్ట బాధితులు 2 లక్షలకు పైగా ఉన్నట్టు వైద్యులు అంచనా వేస్తున్నారు. నడక లేదు సైకిల్ జోలే లేదు శారీరక శ్రమ అంతకంటే లేదు చివరకు మరుగుదొడ్డికి వెళ్లాలన్న ఇంటి లోపలే.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కొనుగోలు శక్తి పెరగడంతో ఆహారం మితిమీరి తినేస్తున్నారు. జపనీయులు తినగలిగిన ఆహారంలో 80శాతం తిని 20 శాతం పొట్ట ఖాళీగా ఉంచుతారు. మనవాళ్ల పరిమితికి మించి 110 శాతం తినేస్తున్నారు. తిండికి తగ్గ శారీరక వ్యాయామం లోపించడంతో పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతోంది.

సమతుల ఆహార లేమి..

ఫైబర్ ఫుడ్ తగ్గించి కార్బొరేట్లు ఎక్కువగా తీసుకోవడం, శాఖాహారం కంటే అతిగా మాంసాహారం తినడంతో సమస్యలు అధికమవుతున్నాయి. తీసుకునే ఆహారంలో మాంసకృత్తులు తగినంత లేకపోవడం పొట్ట పెరగడానికి ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని పట్టణాల్లో పదులు సంఖ్యలో న్యూట్రిషన్ ఫుడ్ సెంటర్లు పుట్టుకొస్తున్నప్పటికీ వ్యాపార దృక్పదమే తప్ప ఫలితం కనిపించడం లేదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వరి ఆధారిత ఆహారం ఎక్కువ స్థాయిలో వినియోగించడం పొట్ట పెరగడానికి ఒక కారణంగా చెబుతున్నారు. వీటికి తోడు పాస్ట్‌ఫుడ్ సెంటర్లు కుప్పకుప్పలుగా పుట్టుకొచ్చాయి. అధిక శాతం పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడం కూడా విద్యార్థుల్లో ఊబకాయ సమస్యకు కారణంగా కనిపిస్తోంది.

తేలికపాటి ఆహారమే ఆరోగ్యానికి మేలు



సాధారణంగా మగవారిలో కనిపించే కామన్ సమస్య బెల్లిఫ్యాట్, లైఫ్ స్టయిల్ మార్చు కోవడం ద్వారా బెల్లిఫ్యాట్‌ను తగ్గించుకుంటే దానంతటదే పొట్ట తగ్గుతుంది. ఫైబర్ ఫుడ్ తీసుకోవడం, జంకుఫుడ్ తగ్గించడం ద్వారా పొట్టను అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.. గ్యాస్ ఇబ్బందులు తలెత్తే ఆహారం జోలికి వెళ్లకుండా తేలికపాటి ఆహారాలు తీసుకోవడంతో పాటు వ్యాయామం కూడా ఉండాలి. హెల్దీ ఫుడ్ తీసుకున్నప్పటికీ అందులోని కేలరీలను కరిగించకపోతే పొట్ట పెరుగుతూనే ఉంటుంది. తీసుకున్న ఆహారానికి తగినట్టు వ్యాయామం చేస్తేనే మేలు జరుగుతుంది. పొట్ట పెరగానికి హార్మోనులు సరిగ్గా పనిచేయకపోవడం కూడా ఒక కారణం. ఈ కారణంగా ఒత్తిడి పెరిగి మెటబాలిజం ఎఫెక్ట్ పడుతుంది. హార్మోన్‌ల అసమతుల్యత వల్ల పొట్ట పెరగడమే కాకుండా బరువు పెరుగుతారు. సమతుల్య ఆహారం తీసుకుంటూ ఒత్తిడి లేకుండా జీవించడమే దీనికి పరిష్కారం.

మానసిక ఒత్తిడిని జయించాలి...



నీటిని పుష్కలంగా తాగడం ద్వారా జీవక్రియ మెరుగుపడుతుంది. నీళ్లను ఎక్కువగా తాగితే ఆకలి అదుపులో ఉంటుంది. దీంతో అతిగా తినరు. ఈ కారణంగా బెల్లిఫ్యాట్ తగ్గుతుంది. అలాగే నిటారుగా నిలబడటం, కూర్చోవడం కూడా ప్రధానమే.. ఏ స్థితిలో ఉన్నప్పటికీ దేహాన్ని ఆయా స్థితికి అనుకూలంగా ఉంచడం ద్వారా దేహానికి ఆరోగ్యం లభించి పొట్ట పెరగకుండా ఉంటుంది. మానసిక ఒత్తిడి పెరగడం మంచిది కాదు.. ఒత్తిడి వల్ల బెల్లిఫ్యాట్ పెరిగి పొట్ట పెరుగుతుంది. ఒత్తిడి తగ్గితే పొట్ట తగ్గడంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుంది. పురుషలలో పొట్టకు సంబంధించిన సమస్యలు ఉంటే డాక్టర్లు లేదా న్యూట్రిషనిస్ట్ సలహాలు తీసుకోవాలి. ఫుడ్ కొవ్వు తగ్గించుకోవడం అధిక సమయం తీసుకునే ఒక ప్రక్రియ, దీనికి సహనం చాలా అవసరం. కంటి నిండా నిద్రపోయేవారు అనారోగ్య సమస్యలకు దూరంగా ఉంటారు. నిద్రతోనే సగం రోగాలు తగ్గిపోతాయి. గాఢ నిద్ర బెల్లిఫ్యాట్‌ను తగ్గించడానికి సహాయ పడుతుంది. కాబట్టి మెరుగైన నిద్ర అవసరం.



మహిళలకు, పురుషులకు మధ్య వ్యత్యాసం..

స్త్రీ, పురుష నిర్మాణంలో తేడాలు ఉన్నందున మహిళల్లో కొలెస్ట్రాలు అధికంగా ఉన్న వారిలో పొట్ట కనిపించదు. ముఖ్యంగా మహిళల్లో తొడలు, తుంటి భాగాల్లో కొవ్వు ఉంటుంది. ఆయా ప్రదేశాలలో కొవ్వు నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గినప్పుడే మహిళలకు పొట్ట దగ్గర కొవ్వు పెరిగి పొట్ట కనిపిస్తుంది. పురుషుల విషయానికి వచ్చేటప్పటికి కొవ్వు కేవలం పొట్ట భాగంలో మాత్రమే పెరుగుతుంది. అందుకే మగవారిలో ఎక్కువగా పొట్ట కనిపిస్తుంది. పొట్ట పెరగడం వల్ల ఆరోగ్యానికి చేటు కలుగుతుంది. పొట్ట కొవ్వు వల్ల రక్తపోటు పెరిగి గుండెపోటు మరణాలు సంభవిస్తాయి. రెండో రకం మధుమేహం వస్తుందని, ఇంకా పురుషుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

బరువు ఎంత ఉండొచ్చు..



ఎత్తు, వయస్సును బట్టి ఎవరు ఎంత బరువు ఉండాలో వైద్యులు చూసిస్తున్నారు. కొందరు హైట్ తక్కువగా ఉండి బరువు ఎక్కువగా ఉంటారు. మరికొందరు హైట్ ఉన్నా సన్నగా ఉంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని బరువు ఎంత ఉండాలో వైద్యులు సూచాయగా వివరిస్తున్నారు. 12 నుంచి 14 ఏళ్లలోపు 36 కిలోల వరకు ఉండవచ్చని, 15 నుంచి 20 ఏళ్లలోపు వారు 45 కిలోల లోపు ఉండాలని, 21 నుంచి 30 ఏళ్ల వయస్కులు 50 నుంచి 60 కిలోలు, 31 నుంచి 40 ఏళ్ల వయస్సు వాళ్లు 65 కిలోల లోపు ఉండవచ్చని, 50 ఏళ్లలోపు వాళ్లు 76 కిలోల వరకు ఉండవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే ఇందులో కచ్చితమైన కొలమానం ఏమీ లేదని, బరువు ఎక్కువ కంటే తక్కువగా ఉంటేనే ఆరోగ్యానికి మేలని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆహార నియంత్రణ అవసరం

డాక్టర్ గంధవరపు రవి, యూరాలజిస్ట్, పాలకొల్లు



ఈమధ్య కాలంలో పురుషులతో పాటు మహిళలకు ఊబకాయం సమస్య అధికంగా ఉంటోంది. దీనికి ప్రధాన కారణం ఆహార నియంత్రణ లేకపోవడమే.. మరోవైపు శారీరక వ్యాయామం లేకపోవడం, ధూమపానం, డ్రింకింగ్ వల్ల కూడా ఊబకాయం సమస్య వస్తోంది. అదే విధంగా జన్యుపరంగా కూడా పొట్ట పెరిగే అవకాశం ఉంది. దీని నియంత్రణకు ప్రణాళికతో ఆహారాన్ని తీసుకోవడం శ్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం.. కొలెస్ట్రాలను నియంత్రణకు వైద్యుల్ని సంప్రదించి సలహాల మేరకు ఔషధాలను వాడితే ఊబకాయం సమస్య నుంచి కొంత బయటపడొచ్చు..

జీవన శైలి మారాలి..

కేఎస్‌బీఎన్.వర్మ, ప్రముఖ పిల్లల వైద్యులు, పాలకొల్లు



ఇప్పుడు అంతా నడక మర్చిపోయారు. సైకిలింగ్ లేదు. గడప దాటితే మోటార్ సైకిల్ లేదా కారు వినియోగిస్తున్నారు. దీంతో శారీరక శ్రమ తగ్గి శరీరంలో కొవ్వు పేరుకుపోతోంది. స్థూలకాయం కారణంగా 30-60 వయస్సు ఉన్న పురుషుల్లో పొట్టలు భారీగా కనిపిస్తున్నాయి. ప్రతీ ఆరుగురిలోనూ ఇద్దరికి పొట్టలు ఉన్నాయి. పొట్టల విషంలో మహిళల కంటే పురుషులే పోటీ పడుతున్నారు. ఆహార నియమాలు మార్చుకోవాలి. డజన్ల కొద్దీ ఇడ్లీలు, దోసెలు తినడం తగ్గించి వ్యాయామం చేయాలి. 20 శాతం పొట్ట ఖాళీగా ఉంచాలి. ఆహార నియమాలు మార్చుకుని వ్యాయామం చేస్తూ వైద్యుల సలహాలు తీసుకోవాలి.



సయ్యద్ సల్మాన్ రూపొందించిన జీపు

శభాష్... సల్మాన్

అతనొక ఆటో డ్రైవరు కొడుకు, కష్టపడి తన తండ్రి ఆటో నడిపి సంపాదించిన సొమ్ముతో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. తన తల్లిదండ్రులు తన కోసం పడుతున్న శ్రమను గుర్తించి చదువులో రాణించాలని ఎంతో తపన పడ్డాడు. తన కృషితో తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తేవాలని ఆశపడ్డాడు. తనకున్న పరిజ్ఞానంతో ఏదో ఒక కొత్త ఆవిష్కరణ చేయాలని సంకల్పించాడు. కొత్తగా ఆలోచించి పల్సర్ ఇంజన్‌తో ఒక చిన్న జీపు తయారు చేసి చూపరులను అబ్బురపరుస్తున్నాడు ఇంజనీరింగ్ స్టూడెంట్ సయ్యద్ సల్మాన్..

- పోలవరం, ఆంధ్రజ్యోతి

సయ్యద్ సల్మాన్ తన తండ్రి ఆజామ్ ఆటో డ్రైవరు కావడంతో మంచి సహకారం లభించింది. పాత పల్సర్ ఇంజన్ కొనుగోలు చేసి జీపు తయారీకి కావలసిన సామగ్రిని సొంతంగా డిజైన్ చేసి ఒక చిన్న జీపుని తయారు చేసి పోలవరంలో ట్రయల్ రన్ వేసి అందరి చేత శబాష్ అనిపించుకున్నాడు. ఈ సందర్భంగా సల్మాన్ మాట్లాడుతూ తాను సూరంపాలెం ఆదిత్య కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నానని, ఒకబైకుపై ముగ్గురు ప్రయాణించడం ప్రమాదకరమనే తలంపుతో తాను ఈ ప్రాజెక్టును రూపొందించినట్టు తెలిపాడు. ఈ జీపుపై ఒకేసారి నలుగురు ప్రయాణించవచ్చని దీనికి రివర్సు గేరు కూడా ఏర్పాటు చేశానన్నారు. అతి తక్కువ ఖర్చుతో నలుగురు ప్రయాణించవచ్చని తెలిపారు. రెండు నెలలు శ్రమించి రూ.80 వేల పెట్టుబడితో ఈ జీపు తయారు చేసినట్లు, భవిష్యత్తులో తక్కువ బడ్జెట్‌తో మరిన్ని కొత్త ఆవిష్కరణలు చేస్తానంటూ దీమా వ్యక్తం చేశాడు సల్మాన్.

విశ్వకర్మతో పనిలో నైపుణ్యం

దరఖాస్తులకు ఆహ్వానం

18 ట్రేడ్‌ల్లో శిక్షణ.. బ్యాంకు రుణాల మంజూరు

- **పశ్చిమలో 24,508 మందికి శిక్షణ.. 3,600 మందికి రూ.9.44 కోట్ల రుణాలు**
- **200 మంది అర్హత.. త్వరలో వీరికి శిక్షణ**



భీమవరం టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ చేతి వృత్తుల వారి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం.. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన. చేతి వృత్తుల్లో నైపుణ్యం సంపాదించేందుకు ఈ స్కీమ్ ద్వారా వివిధ వర్గాల వారికి శిక్షణ అందిస్తారు. 2023 సెప్టెంబరు 17వ తేదీన ఈ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. 2023-24 నుంచి 2027-28 వరకు ఐదేళ్లపాటు ఈ స్కీమ్ కొనసాగుతుంది. ఈ పథకానికి వివిధ వర్గాల నుంచి మంచి స్పందన వచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 2023 సంవత్సరానికి 19 వేల 609 దరఖాస్తులు, 2024లో 19 వేల 609 వెరసి 34 వేల 233 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 24 వేల 508 మందికి 21 కేంద్రాల్లో 930 బ్యాచ్‌లుగా శిక్షణనందించి స్టయిఫండ్ కూడా అందించారు. ఇలా శిక్షణ పొందిన వారిలో అర్హులైన మూడు వేల ఆరు వందల మందికి బ్యాంకుల ద్వారా తొమ్మిది కోట్ల 44 లక్షల రుణాలు మంజూరయ్యాయి. మిగిలిన వారికి త్వరలో మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు.



దరఖాస్తుకు https://pmvishwakarma.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

18 రంగాల్లో శిక్షణ

పీఎం విశ్వకర్మ యోజన కింద 18 రంగాల్లో శిక్షణను అందిస్తారు. వీటిల్లో కమ్మరి, కుమ్మరి, చెప్పులు కుట్టడం, తాపీ, చేపల వలల తయారీ, ఇనుప వస్తువుల తయారీ, డెకరేషన్, శిల్పులు, చెక్క బొమ్మల తయారీ, బ్లాక్ స్మిత్, బుట్టల అల్లిక, బ్యూటీపార్లర్, కార్పెంటర్, గ్లాస్ డిజైనింగ్, పడవల తయారీ, రజక వృత్తులకు శిక్షణ కల్పిస్తారు.

ప్రాథమిక శిక్షణ : విశ్వకర్మలకు శిక్షణ సమయం ఐదు నుంచి ఏడు రోజులు. వీరికి రూ.రోజుకు రూ.500 వరకు స్టైఫండ్ అందిస్తారు. శిక్షణలో ఆధునిక సాధనాలు, డిజిటల్, ఆర్థిక నైపుణ్యాలు, వ్యవస్థాపకత, క్రెడిట్ సపోర్ట్, బ్రాండింగ్, మార్కెటింగ్ టెక్నిక్స్ నేర్పిస్తారు.

అధునాతన శిక్షణ : ప్రాథమిక శిక్షణ తర్వాత తర్వాత లబ్ధిదారులు 15 రోజులపాటు ఆధునిక శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ తాజా సాంకేతికతలు, డిజైన్ అంశాలు, పరిశ్రమ భాగస్వాములతో అనుబంధాలను పెంపొందించడం ద్వారా స్వీయ ఉపాధి నుంచి సంస్థలను స్థాపనకు మార్గదానికి వీలు కల్పిస్తుంది.

కొత్త బ్యాచ్‌లకు శిక్షణ

కొత్తగా శిక్షణను అందించేందుకు 200 మంది అర్హత సాధించారు. దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులైన వారికి కచ్చితంగా శిక్షణ ఇస్తారు. ఆపై బ్యాంకుల ద్వారా రుణం మంజూరయ్యేలా చూస్తారు. ప్రస్తుతం తాపి, టైలరింగ్ కార్పెంటర్‌కు సంబంధించి వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. మిగతా ట్రేడ్‌లకు అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తులు చేసుకోవచ్చు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ యోగా ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక

జంగారెడ్డిగూడెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ఛండీఘర్‌లో ఈ నెల 5 నుంచి ఎనిమిదవ తేదీ వరకు జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ యోగా ఛాంపియన్‌షిప్ పోటీలకు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి నుంచి ఒకరు ఎంపికయ్యారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చీఫ్ ఫార్మసీ అధికారి ఇరపా అమ్మాజీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అమ్మాజీని శనివారం ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీ కమల, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు. రాష్ట్రం నుంచి 32 మంది ఉద్యోగులు ఈ పోటీలకు ఎంపికవగా అందులో అమ్మాజీ ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



అమ్మాజీని అభినందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల, సిబ్బంది

గాలికుంటు వ్యాధి టీకాలు

ఏలూరు టూటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ గోవిందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా నెల రోజుల పాటు ఇంటింటికి పశువైద్య సంవర్థక శాఖ సిబ్బంది వెళ్లి టీకాలు వేస్తారని అన్నారు. నాలుగు నెలలు దాటిన పేయదూడల నుంచి గోవుజాతి, గేదె జాతి పశువులకు టీకాలు వేస్తామన్నారు. పాలిచ్చే పశువులకు వ్యాధి సోకితే పాలదిగుబడి తగ్గిపోతుందన్నారు. పశువులు నిరస పడిపోతాయన్నారు. రైతులంతా తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నశ్రీ

విద్యార్థుల వికాసానికి 'సవిస్కర్' దోహదం

నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ

రాజమహేంద్రవరం, మార్చి1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వాస్తవ ప్రపంచ అంతర్ దృష్టులతో విద్యార్థులను సవిస్కర్ వంటి వేదికలు సన్నద్ధం చేస్తాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కామర్స్ అండ్ మేనేజ్మెంట్ ఉత్సవం సవిస్కర్-2025ను శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ ఇంట్లో అమ్మ దగ్గర నుంచి మేనేజ్మెంట్ నేర్చుకోవాలని అన్నారు.వ్యాపార పోకడలు, సాంకేతికత బహిర్గతం, రెజ్యూమ్, కెరీర్ అవకాశాలను మెరుగు పరచడంపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు.

మట్టిలో జీవ జలం...

వేసవిలో మట్టి కుండలకు భలే గిరాకీ - మట్టి పాత్రల్లో నీరు తాగేందుకు ప్రజల మొగ్గు

మండే వేసవి నుంచి ఉపశమనం కోరుకునేవాళ్లు ఏదైనా చల్లగా తాగాలని కోరుకుంటారు. అనుకున్నదే తడవుగా ఇంట్లో ఫ్రిజ్‌లోని నీళ్లు తాగి భానుడి తాపం నుంచి ఉపశమనం పొందుతుంటారు. అయితే ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్న వాళ్లు మాత్రం మట్టికుండల్లోని చల్లటి నీటిని ఆశ్రయిస్తున్నారు. ఫ్రిజ్‌లలోని నీరు ఆరోగ్యానికి హానికరమని గ్రహించి ప్రతి ఒక్కరూ మట్టి కుండలపై ఆసక్తిచూపుతున్నారు. ఇంట్లో ఫ్రిజ్ ఉన్నప్పటికీ ఇంట్లో ఓ మూలన మట్టికుండను ఏర్పాటు చేసుకుని ఈ వేసవిలో ఆ నీటిని తాగి తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడమే కాకుండా చల్లని నీటితో గొంతుతడుపుకుంటున్నారు. దీంతో వేసవి ప్రారంభంలోనే భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మట్టి కుండలు వివిధ ఆకర్షణీయమైన ఆకారాల్లో దర్శనమిస్తున్నాయి.

-భీమవరం అర్బన్, ఆంధ్రజ్యోతి



కుండలకు తగ్గని ఆదరణ...

ఒక్కప్పుడు మట్టిపాత్రల వినియోగం ఎక్కువగానే ఉండేది. తాగునీటి కుండల నుంచి వంటపాత్రల వరకు ప్రతీది మట్టితో చేసినవే వాడేవాళ్లు.. ఆ మట్టి పాత్రల్లోని వంటకాలు చాలా రుచికరంగా ఉండటంతో పాటు తిన్న వారు ఆరోగ్యంగా జీవించేవారు. ప్రస్తుత కాలంలో ఆ మట్టిపాత్రలు కరువయ్యాయి. అయితే తాగు నీటి కోసం వినియోగించే కుండలకు మాత్రం నీటికీ ఆదరణ తగ్గలేదు. రోజు రోజుకు మట్టి కుండల్లో నీటిని తాగేవారి సంఖ్య పెరుగుతోంది. పర్యావరణ నిపులు, వైద్యులు కూడా మట్టి పాత్రల వల్ల ఆరోగ్యానికి జరిగే మేలును తెలియజేయడంతో ప్రజల్లో చైతన్యం వస్తోంది. ఇప్పటికీ కొన్ని హోటళ్లలో మట్టి పాత్రల్లో వండే వంటకాలకు చాలా డిమాండ్ ఉంది.



ఆహా అనేలా వాటర్ బాటిల్స్

ఇంట్లో పెట్టుకునే మట్టి కుండలే కాకుండా బయటకు తీసుకెళ్లేందుకు బాటిల్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఇవి చూడ ముచ్చటగా ఎంతో ఆకర్షణీయంగా ఉంటున్నాయి. లీటరు, రెండు లీటర్లు సామర్థ్యం ఉన్న బాటిల్స్ రూ.100 నుంచి రూ.300 రూపాయల వరకు పలుకుతున్నాయి. ధర కూడా కొంత అనువుగా ఉండటంతో ధనికా పేద అనే తేడా లేకుండా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఆకట్టుకునే ఆకృతిలో..

ప్రస్తుత ట్రెండ్‌కు అనువుగా వ్యాపారులు మట్టి కుండలను తయారు చేసి మార్కెట్‌లో ఉంచుతున్నారు. కుండలు, కూజాలను రౌండుఆకారంలో ఆకట్టుకునేలా తయారు చేస్తున్నారు. కుండల నుంచి తాగునీటిని సులువుగా పట్టుకునేలా కింద ట్యాప్‌లను కూడా అమరుస్తున్నారు. బాటిళ్ల అయితే మరింత అందంగా ఆకట్టుకునేలా ఉంటున్నాయి. ఒక్కో కుండ 10, 20, 30 లీటర్ల నీరు పడుతుంది. వీటి సామర్థ్యాన్ని బట్టి రూ.250 నుంచి రూ.800 వరకు ధర పలుకుతోంది.




ఏలూరు సెయింట్ థెరిసా కళాశాలలో హాల్ టికెట్ల నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు


సీఎస్ఎన్ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థినులు


తాడేపల్లిగూడెంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


భీమవరంలో: నెంబర్ కోసం


పెంటపాడులో పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు


ఏలూరులో విద్యార్థినికి అమ్మ దీవెన

పరీక్షా కాలం..


ఏలూరులో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు


మంచిగా రాయమ్మా.. అమ్మ ధైర్యం


జంగారెడ్డిగూడెంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థినులు

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన ప్రథమ సంవత్సరం తెలుగు/సంస్కృతం/హిందీ/ఉర్దూ-1 పరీక్షలకు విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా, ఉత్సాహంగా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఒకవైపు మండే ఎండలు, మరోవైపు ఈ రోజు పేపర్ ఎలా ఉంటుందో అనే టెన్షన్ వెరసి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ టెన్షన్ టెన్షన్‌గా పరీక్షా కేంద్రాలకు చేరుకుని తమ హాల్ టికెట్ నెంబర్లను చూసుకుని కొంత రిలీఫ్ అయ్యారు. అనంతరం ఆయా సీట్లలో కూర్చుని పేపర్ చేతికొచ్చే వరకు గుండె లబ్‌డబ్ అంటూ కొట్టుకుంటూ ఏదో ఓ కొత్త లోకంలో ఉన్నట్టు విద్యార్థులు ఫీలయ్యారు. ఎట్టకేలకు మొదటి రోజు విజయవంతంగా పరీక్షలు రాసి విద్యార్థులు ఆనందంగా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు.


భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు


ఏలూరు: పరీక్షా పేపర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ఏలూరు క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. మార్చి 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలతో ఏలూరు అమీనాపేటలోని సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు తొలుత జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారని మహిళలు హక్కులు, సాధించిన విజయాలు, సమానత్వం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఈ అవగాహన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక ప్రాధాన్యతను వెలుగులోకి తేవడం లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, మహిళల సాధికారత కోసం సదస్సులు, చర్చలు, ప్రదర్శ నలు నిర్వహించడం చేయడం జరుగుతుందన్నా రు. మార్చి 1 నుంచి 8వ తేదీ వరకూ ఈ కార్య క్రమాలు కొనసాగిస్తారన్నారు. ఈ ర్యాలీలో ఏ లూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, ఏలూరు టూటౌన్ ఎస్‌ఐ నాగకల్యాణి, విద్యార్థినులు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


స్కూల్ ఆవరణ నుంచి ర్యాలీ ప్రారంభించిన పోలీస్ అధికారులు

పరీక్షల వేళ.. ట్రాఫిక్ అస్తవ్యస్తం

ఏలూరు క్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఎంతో టెన్షన్‌తో తమ పరీక్షా కేంద్రాలకు పరు గులు తీశారు. అదే సమయంలో ఏలూరులో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష ముగిసిన తరువాత కూడా ఇదే సమస్య తలెత్తింది.ఏలూరు ప్రభుత్వాస్పత్రి ముందు ఫుట్ పాత్‌లపై ఇరువైపులా వ్యాపారులు ఆక్రమించడం, వారి వస్తువులను రోడ్డుపైకి పేర్చడంతో కనీసం పాదచారులు వెళ్లడానికి వీలులేకుండా పోయింది. మధ్యాహ్నం గంటన్నరపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈట్రాఫిక్‌లో పోలీసు వాహనాలు సైతం చిక్కుడిపోయాయి. చివరకు ట్రాఫిక్

అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

పోలీసులతో పాటు టూటౌన్ పోలీసులు కూడా రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమ బద్దీకరించారు. ప్రభుత్వాసుపత్రి గోడ పక్కన ఉన్న ఫుట్ పాత్‌లపై కొబ్బరి బొండాలు, తోపుడు బండ్ల వ్యాపారాలు ఉండడం వల్ల కనీసం పాదచారులు వెళ్లడానికి ఫుట్‌పాత్ లేకుండా పోయింది. విద్యార్థులు నరకం చూశారు. ఇదిలా ఉండగా నరసింహారావుపేటలో కూడా ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్లే మార్గాల్లో వాహనాలు అస్తవ్యస్తంగా పార్కు చేయడంతో కాలిబాటన కూడా వెళ్ల డానికి కూడా వీలులేని పరిస్థితులు కనిపించాయి. ట్రాఫిక్ పోలీసులు తక్షణం స్పందించాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.


ఏలూరు నరసింహారావుపేటలో పరిస్థితి

అక్రమ ఎరువుల నిల్వలపై విజిలెన్స్ దాడులు


పి.అంకంపాలెంలో ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

జీలుగుమిల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పి.అంకంపాలెంలో శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ ఎరువులు పురుగు మందులు దుకాణంలో విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. దుకాణంలో అక్రమ నిల్వలు ఉన్నట్లు విజిలెన్స్ ఏవో మీరయ్య గుర్తించారు. సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఆయా రికార్డులకు నిల్వలకు పొంతన లేకపోవటంతో కేసు నమోదు చేశారు. అక్రమ నిల్వల్ని సీజ్ చేశారు. వాటి విలువ రూ.8లక్షల 93వేల 850 ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి గంగాధరం చెప్పారు. వీఆర్వో అశోక్, ఎంపీఈవో సత్యనారాయణ ఉన్నారు.

ఫిబ్రవరి నెలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై 3091 కేసులు

కోటీ ఐదు లక్షల రూపాయల అపరాధ రుసుము

ఏలూరు క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో వాహనదారులు ఫిబ్రవరి నెలలో ట్రాఫిక్ నిబంధనలను పాటించనివారిపై 3091 కేసులు నమోదు చేసి కోటీ ఐదు లక్షల రూపాయల అపరాధ రుసుముగా విధించినట్లు ఉపరవాణా కమిషనరు షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై 905కేసులు, త్రిబుల్ డ్రైవింగ్ 31 కేసులు, రవాణా, రవాణేతర వాహనాలకు గాను డ్రైవింగ్ లైసెన్సు లేనివారిపై 356, వాహన బీమా లేని కేసులు 291, ఫిట్‌నెస్ లేనివి 143, టాక్స్ చెల్లించని వాహనాలపై 132 కేసులు, 1202 ఇతర కేసులు జిల్లాలోని వాహన తనిఖీ అధికారులు నమోదు చేసినట్లు షేక్ కరీమ్ తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయవద్దని ఆయన అన్నారు. సీట్‌బెల్ట్ ధరించి కారు నడపడం అలవాటుగా మార్చుకోవాలని, రవాణా వాహనాలకు క్రమం తప్పకుండా టాక్స్, బీమా చెల్లిస్తూ, పర్మిట్, పొల్యూషన్, ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రాలను కలిగి ఉండాలని ఆయన వాహనదారులను కోరారు.

మానవ మనుగడకు తేనెటీగలు దోహదం

ఉండి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):మానవజాతి మనుగడకు తేనెటీగలు ఎంతో ఉపయోగమని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంనకు చెందిన డా.టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎన్‌ఆర్‌పిఅగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో తేనెటీగల పెంపకంపై ఏడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉండి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.మల్లికార్జునరావు మాట్లాడుతూ తేనెటీగలు లేకపోతే మొక్కలలో సంపర్కము జరుగక పూత రాలిపోయి కాయలు ఏర్పడవన్నారు. చివరికి పండ్లు, కూరగాయాలు ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం జరుగుతుందన్నారు. కావున శిక్షణకు వచ్చిన అందరు శ్రద్ధగా తేనెటీగల గురించి అవగాహన పెంచుకుని తేనెటీగల పెంపకం చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర్లు కరోనా తరువాత తేనె ఉత్పత్తులు వినియోగం బాగా పెరిగి వాటికి డిమాండ్ ఉన్నందున ఈరంగంలో మంచి అవకాశాలన్నాయని తెలిపారు. జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఆర్. దేవానంద్ మాట్లాడుతూ తేనెటీగల పెంపకం చేపడితే ప్రభుత్వం తరఫున లక్ష రూపాయలు వరకు సబ్సిడి పథకాలు వున్నాయని తెలిపారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.మల్లిఖార్జునరావు, వ్యవసాయ సహసంచాలకులు సీహెచ్ శ్రీనివాస్, కేవీకే శాస్త్రవేత్తలు ఎన్‌డిబోరా మెషియానా, డా.ఎ.శ్రీనివాస్, డా.ఆర్‌బిందుప్రవీణ్, డా.పి. వినయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయస్సు పెంపుపై హర్షం

ఏలూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆశావర్కర్లకు జీతంతో పాటు 180 రోజులు మెటర్నిటీ లీవ్, పదవీ విరమణ వయస్సు 62ఏళ్ళకు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఏపీ జేఏసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు హర్షం ప్రకటించారు. రాష్ట్రంలోని 42,752మంది ఆశా వర్కర్లకు లబ్ధి చేకూరనుందన్నారు. ఈ అంశాలను ఎప్పటి నుంచో ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ గత ప్రభుత్వంలోనే విన్నవించినా ఉద్యోగ సంఘాల మాట పెడచెవిన పెట్టిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కంటింగ్‌జెంట్ ఉద్యోగులకు కూడా పదవీ విరమణ వయస్సు 62సంవత్సరాలకు పెంచాల ని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పాఠశాల స్థలం కబ్జా చేశారంటూ ఫిర్యాదు

మొగల్తూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు గ్రామ పంచాయతీ పరిధి గుంటపల్లవపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన స్థలాన్ని కబ్జా చేసి ఒక వ్యక్తి గృహం చేస్తున్నాడని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ పాఠశాలకు గ్రామానికి చెందిన కొల్లాటి అప్పారావు 1981లో 8.5 సెంట్లు భూమిని దానం చేశారని ఆ స్థలంలో కొంత భాగం పాఠశాల నిర్మించారన్నారు. మిగిలిన స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించుకుని ఇల్లు కట్టుకుంటున్నాడని గ్రామస్థులు కె.ధనంజయరావు, శ్రీముఖి, సుబ్బారావు, తిరుమాని రామలక్ష్మీ, సీహెచ్‌వీ రమణ ఎంపీడీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

కోడి పందేలపై దాడి

రూ.10150 నగదు స్వాధీనం

లింగపాలెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ములగలంపాడు గ్రామంలో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారివద్ద నుంచి 10150 రూపాయల నగదు, కోడి, కోడికత్తి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.వెంకన్న తెలిపారు.

ఫ్యాన్సీ వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక ఫ్యాన్సీ వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు పత్తేబాదనకు చెందిన బొల్లెపు విద్యాసాగర్ (38)కి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్యాసాగర్ పత్తే బాదలో ఒక ఫ్యాన్సీ వ్యాపారాన్ని నిర్వహిస్తు న్నారు. వ్యాపారం నిమిత్తం కొంత కాలం నుంచి అనేక ఆటుపోటులకు గురై అప్పులు చేశారు. వాటిని తీర్చే మార్గం కానరాక శనివారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అతని భార్య పిల్లలు ఇటీవల వైజాగ్ పుట్టింటికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న విద్యాసాగర్ ఉరి వేసుకున్న సంగతి సాయంత్రానికి ఇరుగుపొరుగువారు చూసి స్థానిక ంగా ఉన్న ఆయన తల్లికి సమాచారం ఇచ్చారు. టూటౌన్ పోలీసులు శనివారం రాత్రి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


విద్యాసాగర్ (ఫైల్)

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



ఏలూరు క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రైలుపట్టాలు దాటుతున్న ఒక వృద్ధుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు శంకరమఠం వీధికి చెందిన చాన్‌బాషా (64) శనివారం మధ్యాహ్నం ఏలూరు గన్‌బజార్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ పి.సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించారు.

చికెన్ వ్యర్థాలతో వాహనం పట్టివేత

పెదపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలతో కూడిన ఐషర్ వాహనం వెళుతుండగా పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామం వద్ద వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్‌ఐ కట్టా శారద సతీశ్ తెలిపారు. వాహనాన్ని, అందులోని సుమారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

నలుగురిపై తేనెటీగల దాడి

పోలవరం, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : అడవి తేనె టీగల దాడిలో నలుగురు తీవ్ర గా యాల పాలయ్యారు. అటవీశాఖ ఫారెస్టు రేంజర్ ఎస్‌కె వలీ తెలిపిన వివరాల ప్రకా రం.. పోలవరం గ్రామానికి చెందిన సోమ రౌతు శ్రీను అతని కొడుకు గణేశ్ పోలవరం ప్రాజెక్టులో పాత చేగొండపల్లి గ్రామంలో ఉంటారు. వీరు గ్రామానికి సమీపంలో ఉన్న పశువుల పాక వద్దకు ఉదయం పాలు తీసుకురావడానికి తమ బైకుపై బయలు దేరారు. మార్గమధ్యంలో 902 కొండ ప్రాంత ంలో అడవి తేనెటీగలు దాడి చేయడంతో బైకు అక్కడే వదిలి పరుగులు పెట్టారు. వారితో పాటు మరో బైకుపై ప్రయాణిస్తున్న పోలవరం ప్రాజెక్టు కార్మికులు ఇంటి వీరబాబు, అడ్డూరి రామచంద్రరావులపై కూడా తేనెటీగలు దాడి చేశాయి. వీరు తేనెటీగలు దాడిలో గాయ పడ్డారు. పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. తీవ్ర అస్వస్థతకు గురైన సోమరౌతు శ్రీనును మెరుగైన చికిత్స కోసం రాజమహే ంద్రవరం తరలించినట్లు వైద్యాధికారి తెలిపారు.


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

ద్వారకాతిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని లేదా యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎంసీ చైర్మన్ తానిగడప అంజలి డిమాండ్ చేశారు. శనివారం ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు ప్రాథమికోన్నత పాఠశాల నిర్వహణ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలను తీర్మానించారు. పాఠశాలలో 6,7,8 తరగతులను ద్వారకాతిరుమల పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకించారు. విలీనం చేయడం వలన ఆయా తరగతుల విద్యార్థులు రాకపోకలకు ఆరుకిలోమీటర్లు ప్రయాణం చేయవలసి వస్తుందని, నిత్యం భక్తుల రాకపోకలతో వాహనాల రద్దీతో ఉన్న రోడ్లపై వెళ్ళడానికి ఇబ్బందులకు గురి కావలసి వస్తుందన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం కాపాడిన పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యల కారణంతో ఒక యువకుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అయితే సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ వారి సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరించి ఆ యువకుడిని కాపాడి తల్లి దండ్రులకు అప్పగించారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన జాలాది జయరాజు, స్వప్న దంపతుల కుమారుడు సుధీర్ (20) ఇంటర్మీడియట్ పూర్తి చేసి ప్రైవేటుగా డిగ్రీ చదువుతున్నాడు. వ్యక్తిగత సమస్యలతో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఏలూరులో రైల్వే ట్రాక్ వైపు వెళుతుండగా రాత్రి వేళ పోలీస్ గస్తీ నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ, వారి సిబ్బంది ఆయువకుడిని గుర్తించి సమయస్ఫూర్తిగా వ్యవహరించి మాటల్లో పెట్టి కాపాడారు. ఆ తరువాత తల్లి దండ్రులకు యువకుని అప్పగించి కౌన్సెలింగ్ నిర్వహించారు. కుమారుడి ప్రాణాలు కాపాడడంతో ఆ తల్లి దండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జంగారెడ్డిగూడెం నుంచి ఆశ్రం ఆసుపత్రికి ఉచిత బస్సు

ఏలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో వైద్య సేవలు పొందే ప్రజల కోసం ప్రతి శనివారం ఉచిత బస్సును ఏర్పాటు చేయడం అభినందనీయమని జంగారెడ్డిగూడెం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు అన్నారు. శనివారం జడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఏర్పాటు చేసిన ఉచిత బస్సును ప్రారంభించారు. ప్రతి శనివారం ఉదయం 7.30 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి బయలుదేరుతుందన్నారు.

ప్రతి రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

నిడమర్రు మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు ప్రభుత్వాలు పథకాలు పొందేందుకు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్ బాషా తెలిపారు. శనివారం ఆయన ఆకస్మికంగా భువ్వనపల్లి గ్రామ రైతు సేవాకేంద్రాన్ని సందర్శించి రైతు విశిష్ట నమోదు కార్యక్రమం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారిణి ఎస్.గీతాదేవి, ఏఈవో జ్యోతి, వీపీఏ సాయికుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఉంగుటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం నాడు స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రాందే రాజారావు, కనుమూరి మురళీ కృష్ణంరాజు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం



ఏలూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాదేపల్లిలో మహాలక్ష్మి గంగానమ్మ పోతురాజుబాబు, ముద్దిరావమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, గోపూజ, రక్షాబంధన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన తదితర పూజలు నిర్వహించారు. ఆదివారం గోపూజ, అభిషేకం, 3వ తేదీన ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు/కామవరపుకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలో శనివారం నాడు 88.64శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు. కామవరపుకోట మండలంలో శనివారం 91.93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో సరళకుమారి తెలిపారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

బుట్టాయగూడెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దళితులకు తీరని అన్యాయం జరిగిందని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ అన్నారు. జగన్ ప్రభుత్వం హయాంలో రద్దుచేసిన 29 పథకాల ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 35వేల కోట్ల రూపాయలను కేటాయించవలసి ఉండగా కేవలం 20 వేల కోట్లు కేటాయించడం దళితులను మోసం చేయడమే అవుతుందన్నారు.

నారాయణపురంలో ఫీవర్ సర్వే

ఉంగుటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం-2 సచివాలయం పరిధిలో ఎన్టీఆర్ కాలనీలో ఆరోగ్య కార్యక్రమాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వైవీ లక్ష్మణరావు ఆరోగ్య సూత్రాలను వివరించి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు.ఆరోగ్య సహాయకులు ఆర్.పార్థసారథి, ఎం.ఎల్.హెచ్.పి.అనూష, ఆశా కార్యకర్త రమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల బడ్జెట్



విఠల్ కుమార్

ఏలూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.47456 కోట్లు కేటాయించటం హర్షణీయమని ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.పి.ఆర్ విఠల్‌కుమార్ హర్షం ప్రకటించారు. భారీ ఎత్తున నిధులు కేటాయింపు బీసీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కులాలకు 10619కోట్లు కేటాయించటం హర్షణీయమన్నారు.

ఉచిత విద్యుత్ పట్ల హర్షం

ఏలూరుటూటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రబడ్జెట్‌లో నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం పట్ల రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు చందనాడ నందీశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 150యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ ఇచ్చేవారని ఇప్పుడు కూటమి ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించటం నాయీ బ్రాహ్మణులకు మేలు చేస్తుందన్నారు. ఆదరణ పథకానికి వెయ్యికోట్లు కేటాయించటం వలన కులవృత్తులు చేసుకునే వారికి ఎంతో సహాయకారిగా ఉంటుందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బడ్జెట్‌తో సంక్షేమం, అభివృద్ధికి బాటలు

ఏలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు సంక్షేమం, అభివృద్ధికి బాటగా నిలుస్తున్నదని పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరికృష్ణ, సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్ అన్నారు. శనివారం జంగారెడ్డిగూడెంలో పార్టీ కార్యాలయం వద్ద రావూరి కృష్ణ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్య, వైద్యం, సాగు, తాగునీటి ప్రాజెక్టులు, రైతన్నల సంక్షేమం కోసం అధిక నిధులు బడ్జెట్‌లో కేటాయించడం అభినందనీయమన్నారు. ఇది ప్రజల బడ్జెట్ అన్నారు. బీసీ సంక్షేమం కోసం అధికంగా నిధులు కేటాయించడం పట్ల రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, టీడీపీ బీసీ సంఘ నాయకుడు రాజాన పండు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ అంబేద్కర్ తెలిపారు. పెరుగుచెట్టు సెంటర్, అంబికా థియేటర్, కెనాల్‌రోడ్డు, నవాబుపేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మున్సిపల్ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మావతి దేవి

భీమడోలు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని భీమడోలు ఎంపీడీవో పద్మావతిదేవి, ఈవో ఆర్డీ సుందరి గ్రామస్థులకు సూచించారు. గుండుగొలను, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. అలాగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై దృష్టిసారించారు. పంచా యతీల్లో మంచినీటి చెరువుల్లో నీటిశాతం ఎంత ఉందో పరిశీలించి ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చెరువులను 100 శాతం నింపాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు.

జీవో నెంబర్ 14 విడుదలపై హర్షం

భీమడోలు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లై హమాలీ కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సివిల్ హమాలీల కార్మికుల జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. 2024-25 సంవత్సరాలకు సంబంధించి సివిల్ సప్లై కార్మికులు డిమాండ్ చేసిన జీవో 14ను ప్రభుత్వం విడుదల చేసి కూలీల రేట్లు పెంచి పాత బకాయిలను అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపుతూ హమాలీ కార్మికులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు, త్రిమూర్తులు, దుర్గారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో పరీక్షకు హాజరయ్యే ముందు పూజలు.. కుమార్తెకు ఆల్‌ది బెస్ట్.. పెదపాడులో తనిఖీలు

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తనిఖీలు నిర్వహించిన అధికారులు

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

ఉంగుటూరు/పెదపాడు/బుట్టాయగూడెం/చింతలపూడి/లింగపాలెం/కామవరపుకోట/జీలుగుమిల్లి/కుక్కునూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి):నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(మహాత్మా గాంధి)లో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున 218 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 202 మంది హాజరయ్యారు. పెదపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మొత్తం 346 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 14 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ బి.కుసుమ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతోపాటు గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల, జిల్లా పరిషత్ కళాశాలలకు చెందిన 407 మంది పరీక్షలు రాయవలసి ఉండగా మొదటి రోజు 34 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. పోలవరం మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 82 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. పోలీసు డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్ పర్యవేక్షించారు. చింతలపూడి మండలంలో తొలిరోజు 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చింతలపూడి కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 235 మందికి 30 మంది గైర్హాజరయ్యారు. అర్చణ కళాశాలలో 289 మందికిగాను 11 మంది గైర్హాజరయ్యారు. హయగ్రీవ కళాశాలలో 232 మందికి 14 మంది గైర్హాజరయ్యారు. లింగపాలెం మండలంలో 293మందికి గాను 250 మంది హాజరయ్యారని స్పెషలాఫీసర్ బి.ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలలోకి హాల్‌టికెట్, పెన్నులు మినహా ఇతర సామగ్రి పట్టుకెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కామవరపుకోట వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 263 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 248 మంది హాజరయ్యారు. తడికలపూడి ఎస్ఐ చిన్నారావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. జీలుగుమిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్థుల్ని ముందుగా నిర్వాహకులు తనిఖీలు చేశారు. మొత్తం 225మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 176మంది హాజరయ్యారని ఇన్‌చార్జి చీఫ్ సూపరింటెండెంట్ బి.బంగారుబాలు చెప్పారు. కుక్కునూరు మండలంలో 23మంది విద్యార్థులు గైర్హా జరయ్యారు. కుక్కునూరు ప్రభుత్వ జూని యర్ కళాశాల, కుక్కునూరు, వేలేరు, కస్తూ రిబా గాంధీ విద్యాలయాల్లో ఇంటర్ చదువు తున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

ఏలూరు టూటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ అన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, మున్నుల జాన్‌గురునాథ్, కాశీకృష్ణ, పాల్‌రాజ్, పలివెల చంటి, డీ.శేఖర్, మురళీ, జుజ్జవరపు ప్రతాప్, పొలిమేర హరికృష్ణ, పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అశువులుబాసిన అమరవీరుల దినోత్సవాన్ని శనివారం నాడు మండలంలోని నల్లమాడు, కైకరంలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగలు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

హరినాథ్‌కు ఉద్యోగ విరమణ సత్కారం

ఏలూరు టూటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోటదిబ్బ వద్ద పించనర్స్ కల్యాణ మండపంలో నగరపాలక సంస్థ ఉద్యోగి హరినాథబాబు ఉద్యోగ విరమణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంఈ సుందరబాబు మాట్లాడుతూ వాటర్‌సప్లైలో ఎన్ఎంఆర్‌గా చేరి, హౌస్‌క్లీనర్‌గా, పిట్టర్‌గా, టాప్‌ఇన్‌స్పెక్టర్‌గా హరినాథబాబు ఎన్నో సేవలందించారని అన్నారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు హరినాథబాబును ఘనంగా సన్మానించారు.

వీఆర్వో రామారావు..



రామారావును సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, సంఘ నాయకులు

దెందులూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి వీఆర్వో ఉద్యోగ విరమణ చేసిన మారగాని రామారావు దంపతులను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా రామారావు పని చేస్తున్నారు. రామారావు సేవలను తహసీల్దార్ బత్తుల సుమతి, మండల సర్వేయర్ రమణారావు తదితరులు కొనియాడారు.

తేజాకు కరాటేలో ఫస్ట్ ప్రైజ్



ఏలూరు టూటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ ఆలిండియా ఓపెన్‌కరాటే పోటీల్లో ఏలూరుకు చెందిన బడేటి తేజ నాగసూర్యకు ఫస్ట్ ప్రైజ్ లభించింది. ఈ నెల 23న చిలకలూరిపేటలో జరిగిన పోటీల్లో తేజకు మొదటి స్థానం లభించింది. కరాటేలో ఫస్ట్‌ప్రైజ్ వచ్చినందుకు తేజను పలువురు అభినందించారు.

పశువులకు టీకాలు వేయించాలి

కొయ్యలగూడెం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): రైతులంతా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని పశువైద్యశాఖాధికారి శ్రీనివాసన్ కోరారు. ఈ మేరకు కొయ్యలగూడెం పశువైద్యశాల వద్ద టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలుర కబడ్డీలో విజేతల బృందంతో హెచ్‌ఎం, తదితరులు

జోనల్ క్రీడల్లో తడికలపూడి విద్యార్థులకు పతకాలు

ఏలూరు అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలో ఫిబ్రవరి 21, 22వ తేదీల్లో జరిగిన అథ్లెటిక్స్, డిస్కస్ త్రో జోనల్‌స్థాయి పోటీల్లో తడికలపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థులు విజేతలుగా నిలిచారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. డిస్కస్ త్రోలో పి.అనిల్, ఎం.పి.ఎన్.శివసాయి, 100మీటర్ల పరుగుపోటీలో టి.మణికంఠ, 200 మీటర్ల పరుగులో ఎస్.రాజశేఖర్ పతకాలు సాధించారని వివరించారు. బాలుర కబడ్డీలో అనిల్, డేవిడ్‌రాజు, మణికంఠ, రాజశేఖర్, మాధవరావు, కృష్ణసాయి, బాలాజీ బృందం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విజేతలను స్కూలు హెచ్‌ఎం సర్వేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు అభినందించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని వినతి

ఏలూరు అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల విధులు నిర్వర్తించే ఉపాధ్యాయ సిబ్బందికి రెండేళ్ళుగా బకాయి పడిన టీఏ, డీఏలను చెల్లించాలని అభ్యర్థిస్తూ శనివారం ఏలూరు విచ్చేసిన ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డిని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. మూల్యాంకన విధుల్లో పాల్గొన్న టీచర్లకు కంటింజెన్సీ బకాయిలను కూడా విడుదల చేయాలని కోరారు.

ప్రైమరీ స్కూల్స్‌గా మార్చవద్దంటూ ఆందోళన



కొయ్యలగూడెం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలను ప్రైమరీ పాఠశాలలుగా మార్చవద్దంటూ మండలంలోని దిప్పకాయలపాడు, అచ్యుతాపురం యూపీ పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రస్తుతం 8వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయని అయితే ప్రభుత్వం ప్రైమరీ పాఠశాలలుగా మారుస్తున్నారని తెలిసిందన్నారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈ మేరకు విద్యాశాఖాధికారులకు వినతిపత్రం కూడా ఇచ్చామన్నారు. ప్రైమరీ పాఠశాలలుగా మారిస్తే తమ పిల్లల్ని ఇంటికి తీసుకెళ్ళిపోతామని తెలిపారు.

94 శాతం పింఛన్‌ల పంపిణీ

ఏలూరుసిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ జిల్లాలో తొలిరోజైన శనివారం సాయంత్రం 6గంటలకు 94.14 శాతం పూర్తి చేశారు. జిల్లాలో 2,60,452 మంది లబ్ధిదారులుండగా రూ.112.94 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. కొందరు లబ్ధిదారులు ఇళ్లల్లో లేకపోవటం, ఇతరత్రా కారణాలతో అందుబాటులో లేకపోవటం వల్ల మిగిలిన పింఛన్లు 3వ తేదీన అందజేయనున్నారు.

నిలిచిన కంటి వైద్య సేవలు



» ఆస్పత్రికి వచ్చిన రోగులు నిరాశగా వెను తిరుగుతున్న వైనం » చింతలపూడి ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత

చింతలపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యులు లేక ఇబ్బందుల పడుతున్నారు. ఎనిమిది నెలలుగా కంటి వైద్యులను నియమించకపోవడంతో రోజూ ఆసుపత్రికి పేషెంట్లు వచ్చి తిరిగి వెళ్తున్నారు. కమ్యూనిటీ ఆసుపత్రిగా ఉన్నప్పుడు కంటి విభాగాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో తాత్కాలికంగా సహాయకులను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. నిత్యం ఆసుపత్రికి వచ్చే పేషెంట్లలో నాల్గవ వంతు కంటి వైద్యానికి వచ్చేవారు. ఇక్కడ సహాయకుడిని కూడా బదిలీ చేయడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రజల విజ్ఞప్తి మేరకు అప్పట్లో సహాయకుడిని నియమించారు. అప్పటి నుంచి కంటి వైద్య సేవలు అందుతున్నాయి. అయితే ఎనిమిది నెలలుగా సహాయకుడిని తీసివేయడంతో అందుకు సంబంధించిన పరికరాలను సంబంధించిన అధికారులు తీసివేశారు. ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యుని పోస్టు ఉన్నప్పటికీ ఆ వైద్యుడిని నియమించడంలేదు. ఇప్పుడు సహాయకుడు లేకపోవడంతో పరి సర గ్రామాల నుంచి వచ్చే రోగులు వైద్య సౌకర్యం లేక తిరుగుముఖం పడుతున్నారు. కమ్యూనిటీ ఆసుపత్రిగా ఉన్నప్పుడు అపోలో ఆసుపత్రి టైఅప్‌తో కమ్యూనిటీ ఆసుపత్రిలో కంటి వైద్య సేవలు అందించేవారు. ఆ టైఅప్ రద్దుకావడంతో ఇప్పుడు రోగులు ఇక్కట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్యం అందిస్తూ సహాయకులు ఉన్నారు. కాని ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యుడు గాని, కనీసం సహాయకుడుగాని లేకపోవడంతో కంటి వైద్యానికి దూరమై పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఏరియా ఆసుపత్రిలో ఈ అసౌకర్యాన్ని గుర్తించి కంటి వైద్యుడిని గాని, కనీసం సహాయకు డినైనా నియమించి కంటి వైద్యం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

రామకోటి ఉత్సవాల్లో పవళింపు సేవ



ఉత్సవాల్లో భాగంగా కళావేదికపై భక్తి సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో గత నెల 8వ తేదీ నుంచి జరుగుతున్న 93వ శ్రీరామకోటి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాపూర్ణాహుతి, అనంతరం పవళింపు సేవా కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు కొట్టు మధు వెంకట్రావు, గాదంశెట్టి రమేష్‌కుమార్, వేమా వెంకట సురేష్‌కుమార్, మానేపల్లి రామారావు బృందం నిర్వహించారు. కళావేదికపై కళాకారులు భక్తి సంకీర్తనలను ఆలపించారు. ఆదివారంతో ఉత్సవాలు ముగుస్తాయని, ఆదివారం రామకోటి ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు

అన్నప్రసాద వితరణ

ఏలూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపేట కాలువ గట్టుపై గల గంగా పార్వతీ సమేత రేవు లింగేశ్వరస్వామి ఆలయంలో గత నెల 25 నుంచి 27వ తేదీ వరకు ఏకాదశ వార్షికోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో శనివారం ఆలయ ప్రాంగణంలో మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ యాజ్ఞిక బ్రహ్మ వీరుభోట్ల కృష్ణశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు వీరుభోట్ల వెంకటేశ్వరరావు శర్మలు భక్తులతో పూజలు చేయించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

టి.నరసాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాజుపోతేపల్లి గ్రామంలో జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు శనివారం షేక్ రమీజాకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన రమీజా అనారోగ్యానికి గురికావడంతో హాస్పిటల్ ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.35916 చెక్కు అందచేసినట్లు తెలిపారు.

పాడె మోసిన ఎమ్మెల్యే చింతమనేని



దెందులూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేతవరం గ్రామానికి చెందిన టీడీపీ దెందులూరు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి మోహన్‌బాబు మాతృమూర్తి ఏసమ్మ మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మోతుకూరి నానిబాబులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏసమ్మ అంత్యక్రియల్లో చింతమనేని ప్రభాకర్ పాల్గొని స్వయంగా పాడె మోశారు.

కాంగ్రెస్ నేత వెంకటస్వామి మృతికి సంతాపం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టిబొమ్మ వెంకటస్వామి(71) మృతికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు సంతాపాన్ని వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

లూర్దుమాత ఉత్సవాలు ప్రారంభం



కామవరపుకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలోని హైస్కూలు రోడ్డులో గట్టుపై గల లూర్దుమాత క్షేత్రం వద్ద మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలు శనివారం పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ దోమతోటి నతానియేల్ దివ్యబలిపూజను నిర్వహించి ప్రారంభించారు. క్రైస్తవ సంఘ నాయకులు చుట్టుమాల బాలస్వామి, బేతాళ రాజేష్, మాజీ సర్పంచ్ సుందరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రాయితీపై చేప పిల్లలు పంపిణీ



చెరువులోకి చేప పిల్లలు వదులుతున్న మత్స్యశాఖ అధికారులు

ఉంగుటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ మత్స్య సహకార సంఘాలకు 60 శాతం రాయితీతో శీలావతి, కట్ల, మోషు పిల్లలను శనివారం వీరభద్రుని చెరువులో వదిలారు. జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జి సంయుక్త సంచాలకులు కే.ఎస్.వి.నాగలింగాచారి, అసిస్టెంట్ డిప్యూటీ అధికారి (బాదంపూడి)నరసయ్య, ఉంగుటూరు మండల ఎఫ్.డి.వో.మంగారావు, బొమ్మిడి మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు తాటిపాక వరహాలరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సొంగా పర్యటన

కామవరపుకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఈనెల 2వ తేదీ కామవరపుకోట మండలంలో పర్యటించనున్నట్టు మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆదివారం మధ్యాహ్నం 12.15 గంటలకు వడ్లపల్లి గ్రామంలో కార్యకర్తలతో సమావేశం అవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొప్పన అంజయ్య నివాసం వద్ద జరిగే సంతాప సభకు హాజరవుతారు. 2 గంటలకు పోలాసిగూడెం గ్రామంలో బిక్కిన వెంకట్రావు నివాసం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని సత్యనారాయణ తెలియచేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



టి.నరసాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెడ్లం గ్రామానికి చెందిన కంకిపాటి మార్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులకు కేతిరెడ్డి సీతారామిరెడ్డి చంద్రకాంతమ్మ చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా తెలుగుదేశంపార్టీ నాయకులు కేతిరెడ్డి వీరారెడ్డి (చినబాబు) ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు.

మృతుల కుటుంబాలకు కరాటం పరామర్శ



ఏలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా తాడిపూడి గ్రామానికి చెందిన యువకులు గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందడం పట్ల డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన తాడిపూడిలోని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. చిన్న వయస్సులోనే వారంతా మృత్యుఒడికి చేరుకోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఒక్కొక్క మృతుని కుటుంబానికి కరాటం రాంబాబు రూ.పదివేలు చొప్పున ఆర్థిక సాయమందించారు.

వైభవంగా మేరీమాత ఉత్సవాలు



మేరీమాత ఊరేగింపులో పాల్గొన్న పాస్టర్లు, విశ్వాసులు

కలిదిండి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో శనివారం మేరీమాత ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విచారణకర్త బంటుమిల్లి యోహాను ఆధ్వర్యంలో దివ్య పూజ బలి, జపమాల తదితర పూజలు నిర్వహించారు. చర్చిలో భక్తులు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మేరీ మాత స్వరూపాన్ని పురవీధుల్లో కోలాటం ప్రార్థనలు చేస్తూ ఊరేగించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



బలివే రామలింగేశ్వరస్వామి హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

బలివే ఉత్సవాల ఆదాయం రూ.40.40 లక్షలు

ముసునూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి):బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.40 లక్షల 40 వేలు వచ్చిందని ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. శనివారం స్వామి వారి హుండీల సొమ్ము లెక్కింపును దేవదాయ శాఖ అధికారులు, గ్రామ ప్రముఖుల సమక్షంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.13,77,951, పూజా రుసుముల ద్వారా 9,54,625, విరాళాల ద్వారా రూ.2,68,098, ఖాళీ స్థలం అద్దెహక్కు ద్వారా రూ.13,10,000, కొబ్బరి చెక్కల ద్వారా రూ.1,30,000 మొత్తం కలిపి ఆదాయం రూ.40 లక్షల 40వేలు ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది కంటే రూ.1,10,000 ఆదాయం తగ్గిందన్నారు. ఫెస్టివల్ ఆఫీసర్ అనురాధ, మాజీ ఆలయ చైర్మన్ మానం గంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సెంట్రల్ జోన్ కబడ్డీ బాలిక విభాగంలో రన్నర్స్‌గా లోకుమూడి

మండవల్లి మార్చి 1(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జోన్ బాలికల కబడ్డీ పోటీల్లో లోకుమూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచారు. జిల్లా స్థాయిలో ఏలూరు అశోక్ నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. సత్తాచాటిన విద్యార్థులకు పీఈటీ వేణు మాస్టర్‌ను హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముదినేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి):పెదపాలపర్రులోని ఈదర శోభనాద్రిచౌదరి జిల్లా పరిషత్ హైస్కూలు 1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. వివిధ ప్రాంతాల్లో పలు రంగాల్లో స్థిరపడిన పూర్వపు విద్యార్థుల కలయిక విశేష అనుభూతిని కలిగించింది. స్నేహితులంతా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు. పూర్వపు విద్యార్థులు బొప్పన రవికుమార్, బొప్పన శ్రీనివాస్, సంకురాత్రి శ్రీను, ఉమ, ఉష, లక్ష్మీ కుమారి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన అపూర్వ సమ్మేళనంలో గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం, బస్ షెల్టరు నిర్మాణం, జాతీయ రహదారి వెంబడి మొక్కలు పెంచడం, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. అభివృద్ధి పనుల నిర్వహణకు సహకరించేందుకు స్థానిక బొప్పన బాబురావు ట్రస్టు సిద్ధంగా ఉందని, నిధుల కోసం వెనుకాడవద్దని ట్రస్టు చైర్మన్, పూర్వ విద్యార్థి బొప్పన నాగభూషణం హామీ ఇచ్చారు. గ్రామంలో ఏయే పనులు చేపట్టాలన్నది ప్రణాళిక రూపొందించే బాధ్యతలను ఈదర సీతారామయ్యకు అప్పగించారు.

రెండు గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

చాట్రాయి, మార్చి 1(ఆంధ్రజ్యోతి):జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు చాట్రాయి, పోలవరం గ్రామాల్లో శనివారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునఃప్రారంభించాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇవ్వడంతో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి రహదారుల పక్కన పేరుకు పోయిన చెత్తను ఎత్తి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



పోలవరంలో చెత్త తొలగింపు పనులు



మాదిగ అమరవీరులకు జోహార్‌లు చెబుతున్న పిన్నమరెడ్డిపల్లి గ్రామస్థులు

మాదిగ అమరవీరులకు ఘన నివాళి

ఆగిరిపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి):పిన్నమరెడ్డిపల్లిలో మాదిగల వర్గీకరణ కోసం ప్రాణత్యాగం చేసిన పదకొండు మంది అమరవీరులకు బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు ఆధ్వర్యంలో ఘననివాళి అర్పించారు. ఈ రిజర్వేషన్ వర్గీకరణ వారి ప్రాణత్యాగ ఫలితం అని కృష్ణమాదిగ భావించారని తెలిపారు. దేశవ్యాప్తంగా మాదిగ అమరవీరులకు మార్చి ఒకటో తేదీన జోహార్లు అర్పిస్తూ ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో నల్లమోతు కాంచనరావు, కొవ్వలి చినబాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





కైకలూరులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులు.. ముదినేపల్లి పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల తనిఖీ.. పరీక్షకు వెళ్తున్న విద్యార్థినులు

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

కైకలూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి):ఇంటర్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కైకలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 359 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. ఆయా కళాశాలల వద్ద 144వ సెక్షన్ అమలు చేశారు. ప్రతీ విద్యార్థిని హాల్ టిక్కెట్ పరిశీలించి పరీక్షా హాలులోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, వైద్య సిబ్బందిని ఏర్పాటుచేశారు.

కలిదిండి : కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 94 మంది విద్యార్థులకు 12 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.గోపాలకృష్ణంరాజు తెలిపారు.

ముదినేపల్లి: ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో జూనియర్ కళాశాలతోపాటు స్థానిక వీఆర్, వికాస్ కళాశాలకు చెందిన 181 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు రాయాల్సి ఉండగా తొమ్మిది మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి, డిపార్ట్‌మెంటల్ అధికారి సుధాకర్ పర్యవేక్షణలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.



● ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష రాసేందుకు తన తల్లితో గుడ్లవల్లేరు నుంచి వస్తున్న దివ్యాంగ విద్యార్థి వెల్లంకి మోహన దుర్గా ప్రసాద్. ఇతనికి పరీక్ష రాసేందుకు సహాయకురాలిని అధికారులు ఏర్పాటు చేశారు.

చాట్రాయి : చాట్రాయిలో 140 మంది హాజరు కావాల్సి ఉండగా 128 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, తొలిరోజు 1931 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1809 మంది హాజరు కాగా 122 మంది గైర్హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య జూనియర్ కళాశాలలో 434 మంది విద్యార్థులకు 396 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారు. వాగ్దేవి జూనియర్ కళాశాలలో 412 మందికి 384 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. సెయింట్ ఆన్స్‌లో 287 మందికి 272 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 347 మందికి 330 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. శారద జూనియర్ కళాశాలలో 451 మందికి 427 మంది హాజరవ్వగా 24 మంది గైర్హాజరయ్యారు.

ఆగిరిపల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 90 మంది విద్యార్థులకు గాను 87 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరైనట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సుజాత తెలిపారు.



కైకలూరు ప్రభుత్వ కళాశాల వద్ద రూమ్ నంబర్లను పరిశీలిస్తున్న విద్యార్థులు



నూజివీడులో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



చాట్రాయిలో ఇంటర్ పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



బాధితుడికి చెక్కు అందిస్తున్న మంత్రి

పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ముసునూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రమణక్కపేటకు చెందిన ఉప్పే శేషబాబుకు గుండె ఆపరేషన్ నిమిత్తం ముందస్తుగా సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షల 50 వేలు విలువ గల చెక్కును శనివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దె రఘుబాబు, రంగు శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాశం నాగబాబు పాల్గొన్నారు.



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న డైరెక్టర్

పాడి రైతు కుటుంబానికి రూ.50 వేలు అందజేత

చాట్రాయి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పాల సహకార సంఘానికి పాలుపోస్తున్న గడ్డం సత్యనారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం కింద మృతుడి భార్య కల్పనకు శనివారం రూ.50 వేలు చెక్కును సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, సంఘం అధ్యక్షుడు శీర్లం పుల్లారెడ్డి అందజేశారు. స్థానిక నాయకులు గడ్డం ప్రభాకరరెడ్డి, కోట జోషి, కంచర్ల హనుమంతరావు, సూపర్‌వైజర్ నరసింహారావు, వేతన కార్యదర్శి గాది సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

శరవేగంగా పింఛన్ల పంపిణీ

నూజివీడు టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం శరవేగంగా సాగింది. లబ్ధిదారులు ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి పింఛన్ సొమ్ములు అందించారు. నూజివీడు మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో 95.2 శాతం పింఛన్‌లను పంపిణీ చేశారని నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 10,363 పింఛన్లు ఉండగా, 9,849 పింఛన్లు అందించామని, మొత్తం 95.2శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశామన్నారు.



మర్రిబంధంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగిని

ముదినేపల్లిలో 93 శాతం

ముదినేపల్లి : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ముదినేపల్లి మండలంలో శనివారం 93 శాతం పూర్తయింది. మండలంలో 8,846 మంది పెన్షనర్లకు, రూ.3.50 కోట్లు పెన్షన్ సొమ్ము పంపిణీ చేయాల్సి ఉండగా, సుమారు 8,206 మందికి రూ.3.62 లక్షలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

ముసునూరు మండలంలో 95శాతం

ముసునూరు : మండలంలో 95 శాతం పెన్షన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు వీవోఏలు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, వ్యవసాయ సిబ్బంది సైతం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ నగదును అందజేశారు. ఎంపీడీవో రాణి, ఈవోపీఆర్డీ బీపీ సత్యనారాయణ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.

'బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలి'

నూజివీడు టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కోరుతూ సీపీఐ అనుబంధ రైతుసంఘం నాయకులు నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. సీపీఐ నాయకుడు నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ బలివే ఉత్సవాల సమయంలో అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో శివరాత్రి స్నానాలకు తమ్మిలేరులో దిగి తిమ్మక్కపాలేంకు చెందిన యువకులు, అక్కిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన మరో యువకుడు మృతి చెందారని, వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సీపీఐ నాయకులు చెంగల వెంకటేశ్వరరావు, బొప్పూడి రాంబాబు, కొక్కెరపాటి ఆనంద్, పామర్తి మధు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

3091 కేసులు.. రూ.కోటీ ఐదు లక్షల అపరాధ రుసుము

ఏలూరు క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో వాహనదారులు ఫిబ్రవరిలో ట్రాఫిక్ నిబంధనలను పాటించనివారిపై 3091 కేసులు నమోదు చేసి కోటీ ఐదు లక్షల రూపాయల అపరాధ రుసుము విధించినట్లు ఉపరవాణా కమిషనరు షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై 905 కేసులు, ట్రిబుల్ డ్రైవింగ్ 31 కేసులు, రవాణా, రవాణేతర వాహనాలకు గాను డ్రైవింగ్ లైసెన్సు లేనివారిపై 356, వాహన బీమా లేని కేసులు 291, ఫిట్‌నెస్ లేనివి 143, టాక్స్ చెల్లించని వాహనాలపై 132 కేసులు, 1202 ఇతర కేసులు జిల్లాలోని వాహన తనిఖీ అధికారులు నమోదు చేసినట్లు షేక్ కరీమ్ తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయవద్దని ఆయన అన్నారు. సీట్‌బెల్ట్ ధరించి కారు నడపడం అలవాటుగా మార్చుకోవాలని, రవాణా వాహనాలకు క్రమం తప్పకుండా టాక్స్, బీమా చెల్లిస్తూ, పర్మిట్, పొల్యూషన్, ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రాలను కలిగి ఉండాలని ఆయన వాహనదారులను కోరారు.

పాఠశాలకు వాటర్ కూలర్ వితరణ

కైకలూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి):వేమవరప్పాడు ఎంపీయూపీ స్కూల్‌కు శనివారం గ్రామానికి చెందిన గంగుల గణపతి తన భార్య వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం కుమారుడు పాండురంగారావుతో కలసి పాఠశాలకు రూ.8వేలు విలువ గల వాటర్ కూలర్‌ను వితరణ చేశారు. పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, హెచ్‌ఎం చిట్టూరి చంద్రశేఖర్ వారిని అభినందించారు. రిటైర్డ్ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు లంచ్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవో నరేష్ కుమార్

టీచర్లకు లంచ్ బ్యాగ్‌ల పంపిణీ

ముదినేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్ ముదినేపల్లి మండల శాఖ తరపున మండల అధ్యక్షుడు పుట్టి గణేశ్‌బాబు మండలంలోని ఉపాధ్యాయులందరికీ లంచ్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. మండల రిసోర్స్ సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో సుమారు 260 మంది టీచర్లకు రూ.46 వేల విలువైన లంచ్ బ్యాగ్‌లను ఎంఈవో కె.నగేష్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నాగరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జస్వంత్‌కు ప్రతిభా పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

జిల్లాస్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో.. ఇంగిలిపాక లంక విద్యార్థి ప్రతిభ

మండవల్లి మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంగిలిపాకలంక జడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి విద్యార్థి పైలా జస్వంత్ జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు జూనియర్ విభాగంలో ద్వితీయస్థానం సాధించి నట్టు హెచ్‌ఎం జె.శాంతకుమార్ తెలిపారు. మెడల్‌తో పాటు రూ.2వేలు నగదు గెలుచుకున్నాడని మెంటర్ ఉపాధ్యాయురాలు చందన తెలిపారు. అలాగే మండలస్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. జస్వంత్‌ను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

నూజివీడు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తిరువీధి లక్ష్మీరామారావు సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో నూజివీడు మండలం రావిచర్లలో శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామసర్పంచ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు వైద్యశిబిరాన్ని ప్రారంభించగా, వైద్యులు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు తిరువీధి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జగన్‌మోహన్

104 వైద్య సేవలను సద్వినియోగించుకోవాలి

ఆగిరిపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి):104 వైద్య సేవలను సద్వినియోగించుకోవాలని డాక్టర్ జగన్మోహన్ సూచించారు. నూగొండపల్లిలో శనివారం 104 (ఎఫ్‌డీపీ) ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలపై పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి చిన్న గ్రామానికి వైద్య సేవల నిమిత్తం 104 వాహనాన్ని ప్రవేశపెట్టారన్నారు. సూపర్ వైజర్ ఎంపీ హెచ్‌ఈవో జి.రత్నబాబు, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, ఏఎన్‌ఎం బి.కుసుమ కుమారి, ఆశా వర్కర్లు 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు

నూజివీడు టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో టెక్‌జెట్-2025లో భాగంగా శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈసీఈ విభాగానికి సంబంధించి వీఐపీ ప్రొఫెసర్ సన్నిదయాల్ ముఖ్య అతిథిగా హాజరై మెషిన్ లెర్నింగ్ మ్యూజిక్ సపరేషన్ స్పీచ్ ఎన్‌హ్యాన్స్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీఐఎం సీనియర్ ఇంజనీర్ యర్రంశెట్టి నిహారిక, సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ప్రాక్టికల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి టూల్స్, స్మార్టర్ సివిల్ ఇంజనీరింగ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

60 లీటర్ల సారా పట్టివేత

ఆగిరిపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పారావుపేటలో ఎక్సైజ్ శాఖ శనివారం జరిపిన దాడుల్లో 60 లీటర్ల నాటుసారాను స్వాధీన పరుచుకున్నారు. ఘటనా ప్రదేశం నుంచి పారిపోయిన కూరాకుల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశామని జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. ఫణికుమార్, కేఎండీ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.